# మారని ఊరు

రచన:
'జ్యోత్స్న'

రాజు ఆ ఊరికి కొత్తగా ఉద్యోగ నిమిత్తం వచ్చాడు. మూఢ నమ్మకాలతో సనాతన ఆచార వ్యవహారములు గల ఆ ఊరిలో ఒంటరి యువకుడు, పైగ బ్రహ్మచారి అయిన రాజుకు గది అద్దెకు దొరకటం అసాధ్య మైంది. మొదటి మూడు రోజులు ఆఫీసులోనే గడిపాడు. ఆ ఊరివాడైన అతని సహ ఉద్యోగి సుబ్బారావు అతని అవస్థ గమనించి ఒక రోజు అతన్ని ఊరి చివరలో యున్న తన బాబాయి యింటికి తీసుకొని పోయాడు.

ఏరా బావున్నావా రా కూర్చో సుబ్బారావు బాబాయి, సుబ్బారావుని చూచి అన్నాడు.

మీరూ కూర్చోండి అన్నాడు రాజు వైపు చూస్తు.

ముగ్గురు కూర్చున్నారు.

ఏరా కనిపించడం మానేశావు అసలు రావటమే లేదు.

పెద్దవాడయ్యాడు ఉద్యోగం చేస్తున్నాడు కదా నాన్న మేమెక్కడ గుర్తుంటాము అంది అప్పుడే అక్కడకు వచ్చిన గీత.

ప్రక్కన మనిషి యుండడము గమనించి లోపలి కెళ్ళిపోయింది.

మా అమ్మాయి గీత, ఇక్కడ స్కూల్లో టీచరగా పని చేస్తుంది అన్నారు.

ఆట్లాన అన్నట్లు రాజు తలాడించాడు.

బాబాయ్ మీరు ఏదో ఊహించుకొని అనవసరంగా బాధపడి పోతున్నారు.

ఏవోరా ఈమధ్య నేను ఒంటరి వాడ్నయి పోయానని అందరికి దూరం అయిపోయానని నాలో నేనే కుమిలి పోతున్నాను. ఒరే సుబ్బాబావు నేనెంతో కాలం బ్రతకనురా అన్నారాయన.

రాజుకి ఏమి అర్థం కాలేదు. మౌనంగా కూర్చుండి పోయాడు.

బాబాయ్ ఈయన పేరు రాజు. మా ఆఫీసులో క్రొత్తగా చేరారు. వీరిది బెజవాడ. ఈయన ఉండటానికి రూము కోసం చాల వెతికారు కాని దొరకలేదు. మన ఇంట్లో ఏమైన ఖాళీ ఉందేమో అని తీసుకొచ్చాను అని బాబు వైపు తిరిగి ఈయన మా బాబాయ్ పేరు రఘురామయ్య తాలూకాఫీసులో హెడ్ క్లర్కుగా చేసి రిటైరయ్యారు అన్నాడు.

గీత ముగ్గురికి కాఫీలు అందించింది,

ఏం బాబాయ్ ఏమిటి మరి రూము అద్దెకిస్తావా?

ఒక్క రూమే కదా ఆ పెరటి వైపు రూము ఖాళీ చేసి ఇయ్యవచ్చు అన్నాడాయన.

రాజు మనసు కుదుట పడింది. రూము విషయము తేలి నందుకు.

మరి అద్దె సంగతి సుబ్బారావు అడిగాడు.

రఘురామయ్య నవ్వారు, అద్దేంవుందిరా ఎంతో కొంత.

సరే ఇప్పుడు నేనే రెంట్ కంట్రోలర్ ననుకో చూడండి రాజు ఈ గదికి పాతిక రూపాయయి ఇవ్వండి అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

అలాగే ఒప్పుకున్నాడు రాజు.

రఘురామయ్య దానికి చూడండి మా వాడు ఏదో అడిగాడు కదాని మీరు ఒప్పుకోకండి మీకు ఎంత ఇవ్వాలనిపిస్తే అంతే ఇవ్వండి అన్నాడు.

అబ్బే సుబ్బారావుగారు చెప్పారని కాదు. పాతిక రూపాయలు ఇవ్వటం నాకు ఇష్టమే రూములే అద్దెకివ్వని ఊర్లో అడిగిందే తడువుగా ఇచ్చారు. మీకెంతైన ఋణపడి యుంటాను పోతే మా ఆఫీసులో పెట్టె బెడ్డింగున్నాయి రేపు ఉదయం తీసుకు వస్తాను, ఏమైన అభ్యంతరముంటే రెండు రోజులు ఆగివస్తాను అన్నాడు రాజు.

మీరిప్పుడు వచ్చినా అభ్యంతరము లేదు అన్నారు రఘురామయ్యగారు.

వస్తాం బాబాయ్ అంటూ లేస్తూ మాటల్లో చెప్పటమే మరిచాను రాజుగారు మంచి ఆర్టిస్ట్ అన్నాడు.

అయితే మీరు బొమ్మలు వేస్తారన్నమాట అన్నారు సంతోషంగా.

మా బాబాయ్ కూడ మంచిగా బొమ్మలు వేస్తాడు.

ఈ మాటలు వినగానే రఘురామయ్య ముఖం పాలిపోయింది. కళ్ళలో బాధగూడు కట్టుకుంది. దీన్ని రాజు, సుబ్బారావులు గమనించారు.

వేం పోతాం అని సెలవు తీసుకొని బయటకు వచ్చేశారు,

ఆర్టిస్ట్ అనగానే మీ బాబాయ్ అట్లా అయ్యారెందుకండి అని అడిగాడు రాజు బయటకు రాగానే,

సుబ్బారావు మౌనం వహించాడు,

దీని వెనుక ఏమైన కథ వుందా తిరిగి రాజే ప్రశ్నించాడు.

కథ కాదు రాజాగారు, దీని వెనుక బాబాయ్ జీవితం వుంది.

అది ఏందో చెప్తారా రాజు ఆసక్తిగా అడిగాడు, మీకేమైన అభ్యంతరము లేకపోతే నే తప్పకుండ చెప్తాను. మీకు తెలిసియుండటం కూడ మంచిది. ఆ హోటలుకు పదండి అక్కడ కూర్చుందాం.

ఇద్దరూ హోటల్ వైపు నడిచారు.

◆ ◆ ◆ ◆

రఘు నడుస్తూ ఆ వీధి చివరవరకూ రాగానే అతని కాళ్ళు ఆగలేదు కాని కన్నులు మాత్రం రెప్ప వేయకుండ ఎదురింట్లో శిల్ప సుందరిలా నిలబడ్డ యువతిపై కేంద్రీకరించబడ్డాయి.

ఆమె అతని దిక్కు చూసింది.

ఆమె తన దిక్కు చూస్తుందని గ్రహించి చూపులు మరల్చుకొన్నాడు. స్వతహా చిత్రకారుడు కావటంవలన ఎంత నిగ్రహించుకొందామన్న నిగ్రహించుకోలేక వెనుకకు తిరిగి చూస్తూ ఆమె కళ్ళలో కళ్లు కలుపుతూ ఇద్దరిని ధీ కొనబోయి తమాయించుకొని తన యింటికి చేరాడు.

యింటికి చేరాడే గాని రఘు మనస్సంతా ఆమె పై నిమగ్నమై యుంది.

ఎంత అందంగా వుంది, ఆమె కూడ నన్ను చూసింది కదా ఆమె కూడ ఇంత అందగాడిని ఎదురొక్కుంటుందా లేక రోడరోమియో అనుకొంటుందా అయిన తను అట్లా చూడకుండవుండవలసింది. ఈవిధంగా ఆలోచిస్తు గడిపాడు. ఎంతకూ నిద్రరాక, ఇక ఇలా లాభం లేదనుకొని కుంచె అందుకొన్నాడు:

చూడగానే ఆనందింపచేసే ఆ అందాన్ని కన్నులు చెదరకొట్టే ఆ చందాన్ని చందమామ లాంటి ఆ ముఖాన్నుండి చల్లదనాన్ని విరజిమ్మే ఆ సోగకనులను మనసారా తనివితీరా కాగితంపై చిత్రించి దానిక్రింద స్వప్నసుందరి అని ముద్రించి దానిని తన రొమ్ముపై వాల్చుకొని నిద్రాదేవి ఒడిలో వాలిపోయాడు.

రోజు ఆమె కళ్ళతో 'కళ్ళు' కలిపి కవలేని కాంతులను విరజిమ్ముతూ, ఎవ్వరు వినకుండ చూడకుండ ఎన్నో మూగ బాసలు చేస్తు, ఆ రోజు ఆమె నిలబడ్డ తీరును కాగితంపై తీర్చి దిద్దుతూ కాలం గడుపుతున్న రఘు దినచర్య అనుకోకుండ ఒక మలుపు తిరిగింది.

నడిచి వస్తున్న రఘు స్వప్నసుందరి తండ్రి పిలవడం గమనించి భయానందములతో ఆయన దగ్గరకుపోయి కొంతసేపు మాట్లాడి వచ్చేసాడు.

వారి మాటలవలన తెలిసిందేమిటంటే వారు ముస్లిమ్స్ ఒక్కతే కూతురు పేరు నసీమా. ఈ పరిచయాన్ని పెంచుకొని రఘు ఆ కుటుంబంతో ఎంతో సన్నిహితుడయ్యాడు.

రఘు మా వాళ్ళు నాకు సంబంధాలు చూస్తున్నారు.

రఘు మౌనం వహించాడు.

ఏం మాట్లాడవు రెట్టించింది.

ఏం మాట్లాడమంటావు స్వప్నా అన్నాడు రఘు. అతడు నసీమాను ఎప్పుడూ అట్లానే పిలుస్తాడు.

మనం రిజిస్టర్ మ్యారేజి చేసుకొందాం అంది అతని కళ్ళలో చూస్తు,

ఆలోచించే మాట్లాడుతున్నావా అన్నాడు.

ఇంత కాలం ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. మనం ఇంక ఆలస్యం చెయ్యటం మంచిది కాదు. తర్వాత విచారించి లాభంలేదు.

చూడు స్వప్న నేను నిన్ను ప్రేమిస్తున్నాననే కంటె ఆరాధిస్తున్నానంటే బాగుంటుంది.

నీకోసం ఎన్ని కష్టాలైన పడగలను అవసరమయితే ప్రాణాలయిన ఇవ్వగలను కాని...

కాని పెళ్ళి చేసుకోలేనంటావు అంతే కదా. నన్ను పెళ్ళిచేసుకొంటే మీ వాళ్ళను వదులుకోవలసివస్తుంది. సంఘంలో హీనంగా చూడబడతావు పైగా...

ఆపు స్వప్న ఆపు నీ కఠోర మాటలతో నా హృదయాన్ని ముక్కలు చేయకు, నా ప్రేమను అవమానించకు. నాకంటె గొప్పవాడిని చేసుకొని సుఖంగా వుంటే నిన్ను నావలన బాధ కలిగించకూడదనుకొన్నా గాని ఈ లోకానికి భయపడికాదు. నాకు కావలసింది నీ సుఖం స్వప్న నీ సుఖం అన్నాడు ఆవేశంగా.

సుఖం ,హు, సుఖం ఎక్కడుంది రఘు. మనసిచ్చిన వాడిని వదులుకొని ముక్కు మొగం ఎరుగనివానితో పోతే సుఖం ఉంటుందా, లేక మనస్సును నీ దగ్గరుంచి శరీరాన్ని అక్కడుంచితే సుఖం వుంటుందా చెప్పు రఘు చెప్పు.

చెప్పలేవు కదూ నే చెప్తావిను. ఎన్ని కష్టాలు పడిన కూడ ప్రేమించినవాని సన్నిధిలోనే స్త్రీకి సుఖం. రఘు నిన్ను ఇంతవరకు ఏమి కోరలేదు. ఇప్పుడు కోరుతున్నా, నీ పాదాల చెంత నాకింత చోటియ్ రఘు అని అతని కాళ్ళపై పడింది,

నీ స్వప్నా నీ ఏ కోరికను ఎప్పటికి సాధనను నీ సుఖమే నా సుఖం అన్నాడు ఆమెను తేపుతూ. కాదు మీ సుఖమే నా సుఖం అంది కళ్ళు తుడుచుకొంటూ.

సుబ్బారావు చెప్పటం ఆపాడు.

తర్వాత ఏమైంది రాజు ఆత్రంగా ప్రశ్నించాడు.

తర్వాత ఇద్దరు తమ తమ తల్లిదండ్రులను ఎదిరించి పెళ్ళి చేసుకొని ఈ ఊరు చివర కాపురం పెట్టారు. ఎవ్వరూ వాళ్ళ యింటికి పోయే వాళ్ళుకాదు, నేను మాత్రం అప్పుడప్పుడు పోతుండేవాడిని చిన్నప్పట్నుంచి బాబాయ్ అంటే నాకు చాల యిష్టం. ఎవ్వరూ తమ యింటికి రాకపోవటంలో ఆ భార్యా భర్తలు మానసికంగా చాల దిగజారిపోయారు.

గీత పుట్టిన కొన్ని సంవత్సరాలకు స్వప్న మరణించింది అని ముగించివేచాడు.

పెద్దగా నిట్టూర్చి రాజు అతన్ని అనుసరించాడు.

• • • •

ఎక్కడికి పోతున్నారు.

రూముకు తాళంవేసి కాఫీ త్రాగుదాం అని బయలుదేరిన రాజు వెనుక దిరిగి చూశాడు.

గీత వాకిట్లో నిలబడి ఉంది.

కాఫీకేనా అంది.

అవును అన్నాడు.

నేను తయారుచేసాను తీసుకొనివస్తా కూర్చోండి అని అతని సమాధానం కొరకు ఎదురుచూడకుండానే లోపలికి వెళ్ళిపోయింది.

ఇప్పుడు ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్న రాజు రావోయ్‌రా అని రఘురామయ్య పిలవగానే తలుపుతీసి సరిగా లోపలికి వెళ్ళాడు.

గీత ఇద్దరికి కాఫీ అందించి లోపల కెళ్ళిపోయింది.

హోటల్ భోజనం ఏం బాగుంటుంది ఇక్కడే భోంచెయ్యమంటె కాదన్నావు, పోనీ కాఫీ అయిన తాగకుంటె బాగుండదయ్యా ఇకనుంచి కాఫీకి ఎక్కడకిపోకు ఏమంటావు అన్నాడాయన.

సరే అంటూ తలవూపాడు రాజు.

ఏమంటూన్నారు నాన్న అంటూ గీత వచ్చింది.

ఏమంటాడమ్మా నీచేతి కాఫీ తాగింతర్వాత ఎవరైన వదులుకొంటారా.

పో నాన్న నీ వెప్పుడూ అలాగే అంటావు అని రాజు వైపు చిలిపి నవ్వును విసిరి ఖాళీ కప్పులు తీసుకెళ్ళింది.

ఏమిటి ఈ అమ్మాయి ఉద్దేశ్యం తను ఎంతదూరంగా వుందామన్న తన చిలిపి చూపులతో నవ్విస్తుంటుంది. తాను దూరంగా ఉందామనుకొంటాడే కాని ఆ చిలిపి నవ్వును చూడగానే కరిగిపోతున్నాడు. తనుకూడ ఆమెను ప్రేమిస్తున్నాడా.

ఏదో ఆలోచిస్తున్నట్టున్నావు అన్నారు, రఘురామయ్యగారు.

అబ్బే... బ్బే... ఏంలేదు. మీ ఆరోగ్యం అంత బాగున్నట్టు లేదు అన్నాడు మాట మారుస్తు.

ఏం ఆరోగ్యం లే బాబు వారం రోజులనుంచి అంత మంచిగ ఉండటంలేదు అన్నాడాయన.

మరికొంచెం సేపు కూర్చుని తన రూముకు వెళ్ళిపోయాడు రాజు.

మగతగా నిద్రపోతున్న రాజు గీత కేకలకు లేచి లోపలి వెళ్లాడు.

మంచంమీద ఆయాసపడుతు రఘురామయ్యగారు ఏదో కొనివున్నారు.

ఆయన గుండెలమీద రాస్తూ గీత ఏడ్పును దిగమింగుకుంటుంది. పరిస్థితి గ్రహించిన రాజు డాక్టరుకుఫోన్ చేసి వచ్చాడు.

ఇంకా ఆయన ఆయాసపడుతూనే వున్నారు.

ఏం బాధ పడకండి డాక్టరుగారు వచ్చేస్తారు అన్నాడు. అతని మాటలు అతనికే వెలితిగా అనిపించాయి.

నాకు ఒకటేబాధ బాబు అమ్మాయి పెళ్లి చేద్దామనుకొన్నాను గాని చెయ్యలేకపోయాను. అన్నారు బాధగా కూతురు తలనిమురుతు.

మీరేం దిగులు పడకండి గీత పెళ్ళి నేను చేస్తాను.

గీత ఆశ్చర్యంగా అతనివైపు చూసింది.

అది అంత సులభంగాదు బాబు దాన్ని పెళ్ళిచేసుకునేందుకు ఎవ్వరు సాహసించరు . అబ్బా అంటూ గుండెలు పట్టుకొన్నారు.

ఆయన గుండెలు నిమురుతూ గీతను నేను పెళ్ళిచేసుకొంటాను అన్నాడు.

గీత కళ్ళలో మెరుపు మెరిసింది.

కాని అది అన్నంత సులభంకాదు బాబు.

అవును అది అన్నంత సులభంకాదు, రఘురామయ్య అంతటి మనిషే నిలబడలేక పోయాడు.

తనొక లెక్క... అట్లా అని ఆమెను తనే నిరాకరిస్తే ఇంకెవరు చేసుకొంటారు అనుకొన్నాడు.

గీత వైపు చూశాడు. ఆమె ఆశగా చూస్తుంది.

ఏదో ప్రేమించినామనుకొంటారే గాని సంఘానికి వ్యతిరేకంగా ఏదైనచేస్తే అది ఎంత హీనంగాచూస్తుందో నా అనుభవం తలిన తెలుసుకొన్నాను. ఆవేశపడకు అన్నారు.

నేను ఆవేశంగా మాట్లాడటంలేదు రఘురామయ్యగారు, ఆలోచించే మాట్లాడుతున్నాను. నాకు కావలసింది నేను ప్రేమించిన వాళ్లుకాదు నన్ను ప్రేమించే వాళ్లు కావాలి. గీత మనస్సును అర్థం చేసుకోగలిగాను. మీ అనుమతి అయితే గీతను పెళ్లి చేసుకోవటానికి అభ్యంతరములేదు. ఇకపోతే సంఘం అన్నారు సంఘం ఎక్కడ వుంది? ఆ సంఘంలో మీరు నేనుకూడ వున్నాము. కాలం మారుతుంది. మనుషులు మారుతున్నారు. కాని ఈ ఊర్లోని మనుషులు మారటంలేదు. ఎందుకు?

ఎవరికి వారు సంఘానికి భయపడటమే. సంఘం అంటే తామే అని తామంతా మారితే సంఘం ఏమనదని గ్రహించుటలేదు. అలా గ్రహించేరోజు తప్పక వస్తుంది. మీరేమి భయపడకండి అన్నాడు ఆవేశంగా.

గీత రెప్ప వాల్చకుండ అతన్నే చూస్తుంది.

నాకు ఇంతకంటె ఏంకావాలి. అమ్మా గీత నీవు చాల అదృష్టవంతురాలివి. దైవం వంటి భర్త దొరికాడు. అని ఇద్దరి చేతులు బిగించారు రఘురామయ్యగారు.

ఆ చేతులను బిగించిన ఆ చేతులు బిగుసుకపోయాయి.

లోపలికి అడుగుపెట్టిన డాక్టరు తన అవసరంలేదను కొని వెనక్కి తిరిగిపోయాడు.


# ఆల్ ఇండియా పాప్యులారిటీ పోటీ !!

## ఎంట్రీ ఫీజులేదు - మీరు బహుమతిని గెలుపొందవలెను

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

మొదటి బహుమతి; ఒక స్కూటరు వెస్పా లేక అల్విన్ రిఫ్రిజిరేటర్ లేక టెలివిజన్ సెట్. 2 వ బహుమతి: ఒక టేపు రికార్డరు లేక ఆటోమేటిక్ కెమేరా 3వ బహుమతి: (100) టోయో జపాన్ మోడల్ 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్లు. ధర : రు. 275/- ధరలో అర్థ,

### మీరు చేయవలసినది?

5 (అయిదు) నుంచి 20 (ఇరవై) వరకు గల అంకెలను నిలువుగా, అడ్డముగా. అయిమూలగా ఎటుకూడినా మొత్తం 50 (యాభై) వచ్చునట్లు ఒకఅంకెనుఒకేసారి వాడి పైగదులను పూరించవలెను.ఎంట్రీలకు తెల్లకాగితమును ఉపయోగించవలెను.

ఆఖరి పోస్టింగ్ తేదీ: 20-8-73

ఫలితం తేదీ: 22-8-73

సహాయముకొరకు 46 మొత్తము:

| | | | |
|---|---|---|---|
| 8 | 11 | 14 | 13 |
| 15 | 12 | 9 | 10 |
| 17 | 18 | 7 | 4 |
| 6 | 5 | 16 | 19 |

(1) ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనది. మరియు చట్టబద్ధముగా న్యాయమైనది. ఈ పోటీ విషయంలో ఇది ఒక ముఖ్యమైన షరతు. (2) ఎంట్రీలయొక్క సక్రమము మా అఫిషియల్ సీల్డు సొల్యూషన్‌తో సరిపోల్చి ఖచ్చితముగా చూడబడును. (3) నగదుగా బహుమతి ఇవ్వబడదు. (4) మొదటి బహుమతి (1) అఫిషియల్ సొల్యూషన్‌తో సక్రమముగా వున్నట్లు కనుగొనబడినదానికి యివ్వబడును. (5) రెండవ బహుమతి: (1) పైన అడ్డముగావున్న 3 వరుసలతో సమానంగా వున్నదానికి ఇవ్వబడును. (6) మూడవ బహుమతి: (100) మా అఫిషియల్ సొల్యూషన్‌తో ఏ వరుసతోనైనా, సంఖ్యతోనైనా సమానముగా వున్నదానికి యివ్వబడును. (7) గెలుపొందినవారికి పదరు బహుమతులు పొందుటకు పోస్టేజి, ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించవలెను. (8) ఫలితములు పొందుటకు 45 పైసల పోస్టల్ స్టాంపులు పంపాలి. (9) కటింగ్ లేక నిబంధనల కాపీ భవిష్యత్తులో ఉపయోగార్థము ఉంచుకోండి.

**B. B. & C. CORPORATION (M·K·M·-50)**
**P.O. Box No. 1635, DELHI-6.**